


మహబూబ్‌నగర్‌లో న్యూ ఇయర్ వేడుకల్లో కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న యువతులు



జడ్చర్ల పట్టణంలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

2025కు గ్రాండ్ వెల్‌కమ్

సాక్షి, నెట్‌వర్క్: నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కటింగ్‌లకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు. జనవరి మొదటి తేదీన కేక్‌లను కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. కులమతాలకతీతంగా ప్రతి ఇంట న్యూ ఇయర్ కేక్‌లను వాడుతుండడం వల్ల బేకరీల నిర్వాహకులు వివిధ రకాల కేక్‌లను తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. రెండు రోజుల నుంచి జిల్లా కేంద్రంలో కేక్‌ల విక్రయాలు ఊపందుకున్నాయి. జిల్లా కేంద్రంలోని దాదాపు 60 నుంచి 70 వరకు బేకరీల్లో న్యూ ఇయర్ వేడుకలకు 60 వేల నుంచి 70వేలకు పైగా కేక్‌లను అందుబాటులో ఉంచారు. మహబూబ్‌నగర్ పట్టణంలో పలు చోట్ల ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి కేక్‌లను విక్రయించారు. వివిధ ఆకృతుల్లో తయారు చేసిన న్యూ ఇయర్ కేక్‌లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. బేకరీల వద్ద కేక్‌ల కొనుగోళ్లతో సందడి నెలకొంది. జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలో లలితాంబికాదేవాలయం కొత్త సంవత్సర వేడుకలకు ముస్తాబైంది.

సామాజిక సేవల్లో పాల్గొనాలి

సామాజిక సేవల్లో పాల్గొనాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పటికైనా విరమణ తప్పదని మహబూబ్‌నగర్ ఎక్సైజ్, ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్ సయ్యద్ సఫ్దర్ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడారు. శేష జీవితంలో సామాజిక సేవల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సీడీపీఓ, సూపర్‌వైజర్ పరీక్షలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా మహిళా శిశు సంక్షేమ శాఖలో అధికారులు (సీడీపీఓ), ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(సూపర్ వైజర్) గ్రేడ్ 1 పోస్టుల ఎంపికకు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో జనవరి 3, 4 తేదీల్లో నిర్వహించే సీడీపీఓ పరీక్ష, జనవరి 6,7 తేదీల్లో నిర్వహించే ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణపై పోలీస్, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేసిన నిబంధనలుపై అవగాహన కల్పించారు. జిల్లాలో జనవరి 3,4 తేదీల్లో సీడీపీఓ పరీక్ష, జనవరి 6,7 తేదీల్లో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించేందుకు మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్‌లోని జయప్రకాష్ నారాయణ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీడీపీఓ పరీక్షకు జనవరి 3న 180 మంది, జనవరి 4న 180 మంది హాజరు అవుతారని, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టుకు జనవరి 6న 184 మంది, జనవరి 7న 180 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అవుతారని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లు, పరీక్ష కేంద్రం వద్ద మెటల్ డిటెక్టర్‌ను ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.కృష్ణ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 21వ వార్డు పరిధిలోని శేషాద్రి నగర్, నాగిరెడ్డికాలనీలలో మంగళవారం రెండు సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ ఎంవీఎస్ జూనియర్ కళాశాల నుంచి బీకేరెడ్డి కాలనీ ఆటో స్టాండ్ వరకు, నాగిరెడ్డికాలనీలో ఈ రోడ్లతో పాటు డ్రెయినేజీ నిర్మిస్తున్నమన్నారు. కార్యక్రమంలో గోటూరి రాజు, విజయ్, జీవన్‌బాబు, హైదర్‌పాషా, సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించి విధులు



కేక్ కట్ చేయిస్తున్న డీటీ తహసీల్దార్ కేసీరెడ్డి దేవేందర్

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు అంటే సవాళ్లను అధిగమించి నిర్వహించాల్సి ఉంటుందని తహసీల్దార్ ఘాస్సీరాంనాయక్ అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కేసీరెడ్డి దేవేందర్ డీటీగా బాధ్యతలు చేపట్టి ఏడాది పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేయించి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీ సునీల్, గిర్దావర్లు సుదర్శన్‌రెడ్డి, నర్సింగ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలుశిక్ష

నవాబుపేట: మండల కేంద్రంలో గత నెల 28న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో మండలంలోని కారూర్‌కు చెందిన లోకిరేవు నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఈ కేసులో మంగళవారం సెకండ్ క్లాస్ జడ్జి నిందితుడికి 2 రోజుల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ఫైన్‌తో పాటు జైలుశిక్ష సైతం ఉంటుందని, దీన్ని అందరు గమనించాలని ఎస్ఐ హెచ్చరించారు.

పోమాల్‌లో స్కూటీ చోరీ

నవాబుపేట: మండలంలోని పోమాల్‌లో మంగళవారం స్కూటీ చోరీకి గురైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పోమాల్ గ్రామానికి చెందిన రాంచంద్రయ్య రోడ్డు పక్కన గల తన పొలంలో స్కూటీని నలిపి వాకింగ్ వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు స్కూటీని దొంగిలించారు. దీంతో చుట్టుపక్కల వేతికినా లాభం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

జనం కోసమే జనంపల్లి వారసుడు



రాజాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న జనంపల్లి శశికళారెడ్డి

రాజాపూర్: జడ్చర్ల నియోజకవర్గ జనంకోసం సేవ చేసేందుకే జనంపల్లి వారసుడు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్, ఎమ్మెల్యే తల్లి జనంపల్లి శశికళారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌నాయక్, నరహరి, యాదయ్య, యాదగిరిగౌడ్, కృష్ణయ్య,శేఖర్‌గౌడ్, విక్రంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తఖీబాబా పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదానం

మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్‌నాయక్ ఆధ్వర్యంలో రంగారెడ్డిగూడలో రక్తదానం శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన యువకులను రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ శశికళారెడ్డి అభినందించారు.

- నవాబుపేట మండల కేంద్రంతో పాటు కారుకొండ, చౌడూర్, దేపల్లి, ఇప్పటూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే సోదరుడు దుశ్యంత్‌రెడ్డి కేక్‌కట్ చేసి సంబురాలు చేశారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
- మిడ్జిల్‌లో కాంగ్రెస్ నాయకులు బస్టాండ్ దగ్గర కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి చెందిన అనురాధ(27) ఆత్మహత్యకు పాల్పడి చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు.. పోలేపల్లికి చెందిన అనురాధ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేది. ఆదివారం పొలంలో పురుగు మందు తాగింది. వెంటనే వైద్యచికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా. మెరుగైన వైద్యం మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్ (వార్డు నం.27)లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సుమారు 35 వేల దరఖాస్తులకు గాను ఇప్పటివరకు సుమారు 23 వేల (65 శాతం) మంది వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మిగతా వారికి సంబంధించి త్వరగా సర్వే పూర్తి చేయాలని సూచించారు.

వివాహితకు వేధింపులు

నవాబుపేట: మండలంలోని మరికల్‌కు చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన నర్సింహులు అనే వ్యక్తి కొన్నినెలలుగా లైంగిక వేధింపులు గురిచేస్తున్నాడు. తనను ఇబ్బందులకు గురిచేస్తూ భర్త, పిల్లల నుంచి దూరం చేసిన అతడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త వదిలేయడంతో ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో తన తల్లి వద్ద ఉంటున్నా వేధింపులు మాత్రం తగ్గడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

ఉద్యమానికి సంఘీభావం

జడ్చర్ల టౌన్: విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులకు సీఐటీయూ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ స్పష్టం చేశారు. మంగళవారం జడ్చర్ల ఎలక్ట్రిసిటి డీఈ కార్యాలయంలో కరపత్రాలు పంపిణీ చేశారు. పోరాడుతున్న కార్మికులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నల్లవెల్లి కురుమూర్తి, సత్తయ్య, జగన్, శ్రీనివాసులు, శంకర్, జాంగీర్, మహబ్బత్‌బాష, జంగయ్యలు పాల్గొన్నారు.

బోయపల్లి గేట్ రూట్‌లో ట్రాఫిక్ డైవర్షన్

మహబూబ్‌నగర్ క్రైం: ఈనెల 2 నుంచి 4వరకు పట్టణంలోని బోయపల్లి రైల్వేగేట్‌ను మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో రైల్వే గేట్ మూడు రోజుల పాటు బంద్ ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ నుంచి బోయపల్లి, నవాబ్‌పేట వైపు వెళ్లే వాహనదారులు తెలంగాణ చౌరస్తా నుంచి కలెక్టర్ బంగ్లా బ్రిడ్జి మీదుగా వెళ్లాలని సూచించారు.